ఓటరు జాబితాలోని తప్పులను సవరించండి

రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమైన డీసీ మారుతి

అంబర్‌పేట, డిసెంబర్ 19 : ఓటరు ముసాయిదా జాబితాలో ఉన్న తప్పులను వెంటనే సవరించాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు అంబర్‌పేట సర్కిల్ డీసీ మారుతీ దివాకర్ దృష్టికి తీసుకువచ్చారు. ఓటరు జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై గురువారం సర్కిల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో డీసీ సమావేశమయ్యారు. ఇందులో బీజేపీ నుంచి ఎడెల్లి అజయ్‌కుమార్, కెంచె చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నుంచి ఫరీద్, ఎంఐఎం నుంచి మహ్మద్ మోసిన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు ఇ.అజయ్ కుమార్ పలు సూచనలు చేశారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బూత్ నంబర్ 41లో 39 మంది చనిపోయిన ఓటర్లు ఉన్నారని, ఆ పేర్లను తొలగించాలని చెప్పినా ఇప్పటి వరకు తొలగించలేదన్నారు. ఇదే బూత్‌లో ఇతర బూత్‌లకు చెందిన ఓటర్లు కూడా ఉన్నారని, వాటిని సరి చేయాలని చెప్పారు. గతంలో ఫిర్యాదు ఇచ్చినా వాటిని ఇంకా సరిచేయలేదని డీసీ దృష్టికి తెచ్చారు. వాటన్నింటిని సరి చేస్తామని డీసీ వారికి హామీ ఇచ్చారు. ఏఈఆర్‌ఓలు బి.రవీందర్, పి.రవీందర్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై సమావేశం

ఓటరు జాబితా సవరణపై గురువారం జీహెచ్ఎంసీ సర్కిల్ -13 కార్యాలయంలో రాజకీయ పక్షాల నాయకులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఏఈఆర్ఓ వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు జెన్న సుధాకర్, కృష్ణదాస్, మాజీద్ పాల్గొని పలు సూచనలను, సలహాలను అందించారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 19

దుప్పట్లు పంపిణీ

చలి తీవ్రత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి పలు ప్రాంతాలలో ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేసిన కార్వాన్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు జగ్జీవన్.

– కార్వాన్, డిసెంబర్19

రేషన్ కార్డుల జారీ ఇంకెన్నాళ్లకో?

- ప్రతి సంక్షేమ పథకానికి కార్డుతో లింకు
- అర్హత ఉన్నా కార్డులు లేక పేదలు అవస్థలు
- త్వరగా జారీచేయాలని వేడుకోలు

అబిడ్స్, డిసెంబర్ 19 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ కార్డులు లేని పేదలకు నూతన కార్డులు జారీ చేస్తామని ప్రకటించినా నేటికి అమలు కాక పోవడంతో పేదలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాలలో కార్డులు లేని వారు నూతన కార్డులు పొందేందుకు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. చేయని వారు కూడా అధికంగానే ఉన్నారు. ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాల మేరకు కార్డులు జారీ చేస్తారని ఎదురు చూసిన వారికి నిరాశగానే మిగిలింది.

ఏడాది గడిచినా..

ఏడాది గడిచినా ప్రభుత్వం ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డులు ఉన్న వారిని అర్హులుగా ప్రకటించడంతో కార్డులు లేని వారు అనర్హులుగా మిగిలి పోతున్నారు. నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో జారీ చేసిన తెలుపు కార్డులు అధికారుల తీరుతో చెల్లనివిగా మిగిలాయి.

గతంలో నిరంతరాయంగా కార్డుల జారీ ప్రక్రియ..

గతంలో కార్డుల జారీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేది. చిరునామాల మార్పు, కార్డులలో పేర్ల తొలగించి డిలిషన్ సర్టిఫికెట్‌లను పొంది ఆ పత్రాలతో తమ పేర్లను ఎక్కడ చేర్చుకోవాలో అవకాశం కల్పించే వారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. రేషన్ కార్డులను ప్రభుత్వం విధించిన సమయంలోనే తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పలు మార్లు రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించారే తప్పా అమలులోకి తేలేదు. 2018లో ఆహార భద్రత కార్డుల పెండింగ్ దరఖాస్తులను అధికారులు పరిశీలించి నూతన కార్డులను జారీ చేసి తిరిగి పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తులకు అవకాశం కల్పించాలి..

మీ సేవా కేంద్రాలలో ఆహార భద్రత కార్డులు పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతించాలని ప్రజలు కోరుతున్నారు. మీ సేవా కేంద్రాల ద్వారా అందిన దరఖాస్తులను పౌరసరఫరాల శాఖ సర్కిల్ కార్యాలయాల చెకింగ్ ఇన్‌స్పెక్టర్‌లు దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి రిపోర్ట్‌ను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కార్యాలయానికి పంపించాలి, తరువాత వారు పరిశీలించి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అందిన దరఖాస్తులను ఆమోదం లభించేందుకు కమిషనర్ కార్యాలయానికి పంపుతారు. కమిషనర్ కార్యాలయం నుంచి కార్డులు జారీ చేసేందుకు ఆమోదం లభిస్తుంది. ఆమోదం లభించిన అనంతరం ఆన్‌లైన్ ద్వారా ఆహార భద్రత కార్డులను పొందేందుకు వీలుంటుంది. ప్రభుత్వం కార్డుల జారీకి అనుమతిస్తే అర్హులకు కార్డులు లభించే అవకాశం ఉంటుంది.

వెంటనే కార్డులు జారీ చేయాలి..

రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణను వెంటనే ప్రారంభించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశ పెట్టిన ప్రతి పథకానికి రేషన్ కార్డు లింకు పెట్టడంతో అర్హత ఉన్నా రేషన్ కార్డు లేని కారణంగా ఆ పథకాల్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రేషన్ కార్డుల జారీకి చర్యలు తీసుకోవాలని పేదలు కోరుతున్నారు.

మహిళ లకు డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

మహిళలకు ఉచిత డ్రైవింగ్ శిక్షణను ప్రారంభించిన ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి

అంబర్‌పేట, డిసెంబర్ 19 : మహిళలకు కొత్త నైపుణ్యాలను నేర్పిస్తూ వారికి మంచి జీవితాన్ని అందిస్తున్న సయోధ్య స్వచ్ఛంద సంస్థ కృషి అభినందనీయమని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి అన్నారు. అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో డీఎస్వీ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో సయోధ్య సంస్థ ద్వారా డ్రైవింగ్ స్కూల్ ఫర్ వుమెన్ స్కిల్ ట్రైనింగ్‌ను గురువారం జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ డీపీఓ రజితతో కలిసి ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు వారు సొంతంగా వాహనాలు కొనుక్కోవడానికి డిస్కౌంట్, బ్యాంకుల ద్వారా లోన్లు ఇప్పించడానికి పూర్తి సహకారం అందజేస్తానని తెలిపారు. డీపీఓ రజిత మాట్లాడుతూ.. డ్వాక్రా గ్రూపుల ద్వారా కూడా మహిళా శక్తి స్కీమ్ కింద లోన్లు డౌన్ పేమెంట్ కోసం ఇవ్వడం జరుగుతుందన్నారు. సంస్థ అధ్యక్షురాలు మృదుల వేణులపాటి మాట్లాడుతూ.. 50 మంది మహిళలకు టూ వీలర్ డ్రైవింగ్‌లో శిక్షణ, 30 మంది మహిళలకు ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ, 20 మంది మహిళలకు కారు డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నామని అన్నారు. మహిళల మొబిలిటి, వారి ఉద్యోగ అవకాశాలు పెరగడం కోసం ఉద్దేశించినదే ఈ ప్రోగ్రాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ డాక్టర్ మౌనిక, కో-ఆర్డినేటర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండలో అయ్యప్ప స్వామి పడిపూజ

కార్వాన్, డిసెంబర్19 : కార్వాన్ నియోజకవర్గం గోల్కొండ బంజారా దర్వాజలో గోల్కొండ బోనాల కులవృత్తుల సంఘం సలహాదారు బి.సాయిబాబాచారి ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గోల్కొండ మైత్రి కమిటీ అధ్యక్షుడు రాజుపస్తాద్ పాల్గొని పూజలు చేశారు. గోల్కొండ కోట మహంకాళి ఆలయ పూజారి సురేశ్‌చారి, కులవృత్తుల సంఘం ఉపాధ్యక్షులు శ్రీకాంత్ చారి,

గోల్కొండలో య్యప్పస్వామి మహాపడిపూజకు హాజరైన భక్తులు

నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురిని సన్మానించారు.

మెహిదీపట్నంలో

మెహిదీపట్నం : అయ్యప్పస్వామి మహా పడిపూజను కార్వాన్ ఉప్పర్ బస్తీ బాలాంజనేయ స్వామి ఆలయం వద్ద వెంకట రమణ గురుస్వామి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మహా పడిపూజలో నిర్వాహకులు అంబటి క్రాంతి సాగర్ తదితరులు పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. గురువారం నింబోలిఅడ్డాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి హెల్మెట్ వాడకం, రాంగ్‌రూట్, పెండింగ్ చాలన్లపై వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు తమ రక్షణ కోసం హెల్మెట్‌ను ఉపయోగించాలని సూచించారు.

– కాచిగూడ, డిసెంబర్ 19

జనవరి1న విశ్వకల్యాణ మహోత్సవం

రవీంద్రభారతి, డిసెంబర్ 19 : విశ్వకర్మ పరమేశ్వరుల వారి విశిష్టతను విశ్వవ్యాప్తం చేయాలన్న సంకల్పంతో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత సారథ్యంలో విశ్వకల్యాణ మహోత్సవాన్ని 2025 జనవరి1న హైదరాబాద్‌లోని తెలుగు లలిత కళాతోరణంలో నిర్వహిస్తున్నామని శ్రీ శాంతికృష్ణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డా.శాంతికృష్ణ ఆచార్య గురువారం రవీంద్రభారతిలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచవేదాలు, ఉపనిషత్తుల సారాంశ ఆధారంగా సమస్త మానవాళితో పాటు సృష్టిలోని అన్ని జీవ రాశులను సృష్టించిన విరాట్ విశ్వకర్మ పరమేశ్వరుల వారి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహోత్సవాన్ని జనవరి 1న ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి విశ్వబ్రాహ్మణ వేదపండితులు విచ్చేసి శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్న ఈ మహోత్సవాలను ప్రజలంతా విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సిండికేట్ బ్యాంక్..కో-ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గం

కో-ఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులు

కాచిగూడ,డిసెంబర్ 19: సిండికేట్ బ్యాంక్ తెలంగాణ మల్టీ పర్పస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని గురువారం కాచిగూడలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ ఇక్బాల్, ఉపాధ్యక్షుడిగా వెంకటి, కార్యదర్శిగా పరమేశ్వర్, కోశాధికారిగా వినోద్, కార్యవర్గ సభ్యులుగా హనుమంతరావు, శ్రీనివాస్, శ్రీకాంత్, లక్ష్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెంకటరమణ, వసంత్‌సేనరాజు, శ్రీనివాస్‌నాయక్, వెంకటేశ్వర్‌రావు, అబ్దుల్‌హాయ్, ఆనంద్‌కుమార్, నవీన్‌కుమార్, రాజ్‌కుమార్, మురళి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీలైన్స్ నిజాం మిలటరీ క్వార్టర్స్‌ను రెగ్యులరైజ్ చేయాలి

కార్వాన్ నియోజకవర్గం టోలిచౌకి డివిజన్ గోల్కొండ ఎండీలైన్స్‌లో ఉన్న నిజాం మిలటరీ క్వార్టర్స్‌ను వెంటనే క్రమబద్ధీకరించాలని కోరుతూ క్వార్టర్స్ వాసులు డిఫెన్స్ ఎస్టేట్ ఆఫీసర్ దినేశ్ రెడ్డికి విన్నవించారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ సూచనలతో ఎంఐఎం నాయకుడు షకీల్ మిలటరీ క్వార్టర్స్ వాసులతో వెళ్లి డిఫెన్స్ ఎస్టేట్ అధికారితో కలిసి మాట్లాడారు. సంవత్సరం క్రితం సర్వే పూర్తి చేశారని, తెలంగాణ ప్రభుత్వం జీవో సిద్ధంగా ఉంచిందని, డిఫెన్స్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 19

అంబర్‌పేటలో టీడీపీ సభ్యత్వ నమోదు

గోల్నాక, డిసెంబర్ 19 : అంబర్ పేట డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. గురువారం బాపునగర్‌లో ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఓ వెంకటేశ్ చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆపార్టీ రాష్ట్ర నాయకుడు బక్కని నర్సింహులు, పిన్నపనేని సాయిబాబా తదితరులు హాజరై.. స్థానిక ప్రజలకు టీడీపీ సభ్యత్వాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నర్సింహాగౌడ్, సత్యనారాయణ, కిరణ్, బాను, యాదగిరిగౌడ్, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మెహిదీపట్నం, డిసెంబర్ 19 : ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన హుమాయిన్‌నగర్ పరిధిలో గురువారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 12 వ తేదీ హుమాయిన్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిదిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా పోలీసులు చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ 14 తేదీ మృతి చెందాడు. వివరాలకు 8712660 480 నంబర్‌లో సంప్రదించాలి.

వెంకటాద్రి రైల్లో దొంగతనం

కాచిగూడ, డిసెంబర్ 19 : వెంకటాద్రి రైల్లో ప్రయాణికుని ల్యాప్‌టాప్ గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన ఆదిత్య సింహాస్ వెంకటాద్రి రైల్లో కుటుంబ సభ్యులతో కలిసి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. అనంతరం బ్యాగు చూసుకునేసరికి అందులో ఉన్న ల్యాప్ టాప్ కనిపించలేదు. గురువారం ఆయన కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

మెహిదీపట్నం, డిసెంబర్ 19 : తప్పి పోయి వచ్చిన వృద్ధుడిని 2 గంటలలో సంబంధీకులకు హుమాయిన్‌నగర్ పోలీసులు అప్పగించారు. ఈ ఘటన గురువారం చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ రాంబాబు తెలిపిన ప్రకారం.. విజయ్‌నగర్ కాలనీకి చెందిన మోసెస్ (90) తప్పి పోయి హుమాయిన్‌నగర్ నాలా వద్ద తిరుగుతుండగా పోలీసులు గమనించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడ ఆయన వివరాలను సేకరించి సంబంధీకులకు అప్పగించారు.

బాలుడి అప్పగింత

సుల్తాన్‌బజార్,డిసెంబర్ 19. తప్పిపోయిన బాలుడిని 30 నిమిషాల్లో వెతికి అప్పగించిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ సూనావత్ రవి తెలిపిన ప్రకారం.. ఈ నెల 17న శేరిలింగంపల్లికి చెందిన శైలజ, తన నాలుగేండ్ల కుమారుడు అభినందన్ కాలికి గాయం కావడంతో వైద్య చికిత్స నిమిత్తం ఉస్మానియాకు వచ్చింది. ఈ క్రమంలో అభినందన్ తప్పిపోయాడు. దవాఖానలో ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో తల్లి శైలజ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దవాఖాన సీసీటీవీ కెమెరాలను పరిశీలించి ఉస్మానియా గేట్ వద్ద బాలుడు ఉన్నట్లు గుర్తించి బాలుడిని తల్లి వద్దకు చేర్చారు. దీంతో ఆమె పోలీసులకు కృతజ్ఞతలను తెలిపారు. బాలుడికి వెతికి పట్టి తల్లికి అప్పగించిన హోం గార్డును అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ రవి అభినందించారు.

గోషామహల్ ప్లేగ్రౌండ్‌లో ఉస్మానియా నిర్మించొద్దు

సమావేశంలో మాట్లాడుతున్న గోషామహల్ మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్‌తో పాటు బెజిని శ్రీనివాస్, గొడుగు గోపీయాదవ్

అబిడ్స్, డిసెంబర్19 : ఉస్మానియా దవాఖాన భవనాన్ని గోషామహల్ స్టేడియానికి తరలించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చుకొని ప్రస్తుత ఉన్నచోటనే పునర్నిర్మించాలని గోషామహల్ బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ ముఖేశ్ సింగ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఉస్మానియా దవాఖానను గోషామహల్ స్టేడియానికి తరలించాలన్న ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదన్నారు. ఇప్పటికే పరిసర ప్రాంతాలలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఉండగా ప్రజలు సతమతమవుతున్నారని ఉస్మానియా దవాఖాన నిర్మాణం జరిగితే ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతుందన్నారు. ఉస్మానియా దవాఖాన ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే తిరిగి పునర్నిర్మిస్తే రోగులకు అందుబాటులో ఉండడంతో పాటు ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. గోషామహల్ స్టేడియంలోకి దవాఖానను మారిస్తే చుట్టుపక్కల ప్రజలు ఇండ్లు ఖాళీ చేసి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న చాక్నావాడి , చందన్ వాడి, గోషామహల్ తదితర పరిసర ప్రాంతాల ప్రజలు నిరసనలు చేపడుతున్నారని వివరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బెజిని శ్రీనివాస్, గొడుగు గోపి యాదవ్ పాల్గొన్నారు.

మహిళా విశ్వవిద్యాలయ బిల్లును అమోదించడం హర్షనీయం

కోఠిలోని మహిళా వర్సిటీ దర్బార్ హాల్ ఎదుట సంబురాలు జరుపుకుంటున్న వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సూర్యధనుంజయ్, స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ సరస్వతమ్మ తదితరులు

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 19 : తెలంగాణలో మహిళల విద్యను ప్రోత్సహిస్తూ వీరనారి చాకలి ఐలమ్మ పేరిట మహిళా విశ్వవిద్యాలయ బిల్లును రాష్ట్ర శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టడం హర్షనీయమని వీరనారి చాకలి ఐలమ్మ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్యధనుంజయ్ అన్నారు. గురువారం కోఠిలోని విశ్వవిద్యాలయం ఆవరణలోని దర్బార్ హాల్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలను ప్రదర్శిస్తూ సంబురాలను నిర్వహించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం పక్షాన బోధన, బోధనేతర సిబ్బంది సీఎం రేవంత్‌రెడ్డికి కృత జ్ఞతలు తెలిపారు. ఇన్నాళ్లు యూనివర్సిటీగా కొనసాగు తున్నా అధికారికంగా చట్టం చేయకపోవడంతో ఉస్మానియా యూనివర్సిటీ పేరిటనే విద్యార్థినులకు పట్టాలు జారీ అయ్యాయని అన్నారు. అసెంబ్లీలో వర్సిటీ బిల్లు ఆమోదం పొందడంతో ఒక ప్రత్యేక గుర్తింపు లభించిందని ఆమె అన్నారు. ప్రభుత్వం మరిన్ని మౌలిక వసతుల కల్పన కోసం సహాయం అందించాలని ఆమె కోరారు. ఈ వర్సిటీలో ఆరు వేల మంది విద్యార్థినులకు విద్యను అంది స్తున్నట్లు ఆమె వివరించారు. వెయ్యి మంది విద్యార్థినులకు వసతి కల్పించడం జరుగుతుందని, ప్రభుత్వం సహకరిస్తే అందరికీ వసతిని కల్పించవచ్చని ఆమె స్పష్టం చేశారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయానికి కావల్సిన వసతుల కల్పన కోసం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ప్రొఫెసర్ సరస్వతమ్మతో పాటు ప్రొఫెసర్‌లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇండోర్ క్రీడా పోటీలు ప్రారంభం

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ముజీబ్‌హుస్సేనీ

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 19 : టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 11వ స్వామినాథన్ క్రికెట్ టోర్నమెంట్-2025ను టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్. విక్రమ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహిస్తున్నారు. ఈ ఇండోర్ పోటీలను టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ, టీజీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ రావు, టీజీవో ప్రధాన కార్యదర్శి ఏనుగుల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ క్రిష్ణాయాదవ్, టీఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, నాయకులు బి. శంకర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, నగర శాఖ కార్యదర్శి హరికృష్ణ, నాజిర్, మాజీ కార్యదర్శి ప్రభాకర్, మాజీ సభ్యురాలు జానకి, ప్రత్యేక ఆహ్వాని తురాలు సీమ హుస్సేనీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యారమ్స్, చెస్, షటిల్ పోటీలను నిర్వహించారు. మూడవ రోజు డెంటల్ జట్టుపై సీఆర్‌వో జట్టు, ఇరిగేషన్ జట్టుపై డీఈవో జట్టు, ఎక్సైజ్ జట్టుపై స్టాంప్ రిజి స్ట్రేషన్ జట్టు, ఐటీఐ జట్టుపై సిటీవో జట్టు, గాంధీ ఆసుపత్రి జట్టుపై సెంట్రల్ లైబ్రరీ జట్టులు విజయం సాధించాయని అన్నారు. టీఎన్జీవో హైదరా బాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కేశర్ రాజ్‌కుమార్, సభ్యులు కురాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా సభ్యత్వాన్ని రద్దు చేయాలి

తిలక్‌నగర్ చౌరస్తాలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

అంబర్‌పేట, డిసెంబర్ 19: డా.బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని, అతనిపై ఎస్సీ ,ఎస్టీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కేవీపీఎస్ అంబర్‌పేట జోన్ కమిటీ ఆధ్వర్యంలో తిలక్‌నగర్ చౌరస్తాలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు ఎం.మహేందర్, జిల్లా కార్యదర్శి బి.సుబ్బారావు, జి.రాములు, అర్జున్, జనార్దన్, మహదేవ్, కిషన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజాపాలన అంటే పేద, మధ్యతరగతి ఇండ్లు కుల్చడమేనా?

కాచిగూడ, డిసెంబర్ 19 : కాంగ్రెస్ ప్రజాపాలన అంటే ముందస్తూ సమాచారం లేకుండా పేద, మధ్యతరగతి ఇండ్లు కులగొట్టడమేనా? అని సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ప్రశ్నించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ప్రజాపాలన చేస్తున్నామని గొప్పలు చెబుతున్నారే తప్పా, ప్రభుత్వం చేసే పనులకు చెప్తున్న దానికి ఏ మాత్రం పొంతనలేదని అన్నారు. నగంలోని పలు ప్రాంతాల్లో దుర్భర జీవనం గడుపుతున్న పేదలకు సమాచారం లేకుండా విచాక్షణా రహితంగా వ్యవహరిస్తూ.. అధికారులు భయాందోళనకు గురిచేస్తున్నారని మండి పడ్డాడు. దీనిపై ప్రభుత్వం వెంటనే అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కళాకారులకు పెన్షన్లు ఇవ్వాలి

కాచిగూడ,డిసెంబర్ 19: తెలంగాణలోని కళాకారులకు పెన్షన్లు ఇచ్చి, ఆదుకోవాలని తెలంగాణ కళాకారుల సంఘం గ్రేటర్ హైదరాబాద్ ప్రతినిధి, యాంకర్ పవన్‌కుమార్ యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం చెప్పల్‌బజాలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకోసం పాటలు పాడిన కళాకారులకు ప్రస్తుతం 70-80 ఏండ్లకు పైబడటంతో వారు అనేక అనారోగ్య , ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కళాకారుల కుటుంబాలకు ఉచిత వైద్యం, ఇండ్ల స్థలాలు అందించాలని అన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలి

కాచిగూడ,డిసెంబర్ 19: కేంద్ర ప్రభుత్వం బీసీలకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం నింబోలిఅడ్డాలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం దేశ వ